నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్–2, నాగారం 11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పృథ్వీరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త విద్యుత్ లేన్ పునరుద్ధరణ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. నాగారం ఫీడర్ పరిధిలోని రెడ్డికాలనీ, చక్రిపురం, కట్టింగ్ కాలనీ, మధురానగర్ కాలనీల్లో ఉదయం 7 నుంచి 7:30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

చెట్ల కొమ్మల నరికివేత కారణాలతో...

కంటోన్మెంట్: ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణాలతో సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఉదయం 6.00 గంటల నుంచి 6.30 గంటల వరకు అల్వాల్ ఫీడర్ పరిధిలోని రిట్రీట్ కాలనీ, భవానీ నగర్, వీబీఆర్ గార్డెన్స్ ప్రాంతాలు. 6.30 నుంచి 7 గంటల వరకు మచ్చబొల్లారం, భూదేవీ నగర్ ఫీడర్ల పరిధిలోని ఏఆర్‌కే హోమ్స్, రుక్మిణి ఎన్‌క్లేవ్, రైల్వే కాలనీ, శాంతినికేతన్ ఎన్‌క్లేవ్ గ్రీన్ ఫీల్డ్స్, కానాజీ గూడ, ప్రాంతాలు. 7 గంటల నుంచి 7.30 వరకు ఆర్‌పీ నిలయం, అల్వాల్ పరిధిలోని భాటియా బేకరీ, వెంకట్రావు పేట, హెచ్‌ఎంటీ, పంచశీల్ ప్రాంతాలు. 7.30 నుంచి 8 గంటల వరకు మచ్చ బొల్లారం పరిధిలోని సాయి రెడ్డి నగర్, శ్రీసాయి కాలనీ, కావేరీ ఎన్‌క్లేవ్, స్నేహ కాలనీ ప్రాంతాలు. 8 గంటల నుంచి 8.30 వరకు ఎంహెచ్‌ఆర్ కాలనీ, ఎరుకల బస్తీ, ధర్మారెడ్డి కాలనీ ప్రాంతాలు. ఉదయం 8.30 గంటల నుంచి 9.00 గంటల వరకు భూపతి రావు నగర్, శక్తి గణేశ్ నగర్, అల్వాల్ హిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఉప్పల్‌లో...

ఉప్పల్: హబ్సిగూడ సీసీఎంబీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు భవానీనగర్ వీధి నంబర్ 1 నుంచి 3 వరకు, వీఎస్‌టీ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, హెచ్‌ఎంటీనగర్ రోడ్ నంబర్–1, 11 కేవీ హబ్సిగూడ ఫీడర్ పరిధిలోని ఉదయం 7 గంటల నుంచి 7.30 వరకు హబ్సిగూడ వీధి నంబర్ 3 నుంచి 7 వరకు, కాకతీయ పార్కు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది తెలిపారు. 11 కేవీ హెచ్‌ఎంటీ నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా వీధి నంబర్ 2 నుంచి 12 వరకు బాపూజీనగర్, నాచారం మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామిరెడ్డి తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



రామంతాపూర్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై ఆసక్తి పెంచుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునని రామంతాపూర్‌లోని షిప్స్ జూనియర్ కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ రాజారెడ్డి అన్నారు. ఇటీవల ప్రకటించిన సీనియర్ జూనియర్ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ అత్యధిక మార్కులు సాధించిన జి.వైష్ణవి కావ్య, సమీరా జోనాథ్, దీపిక, వర్ష, అంజలి, సింధూజ, పవన్, వశిష్ఠ, భవాని, రాజేశ్వరి తదితర విద్యార్థులను శుక్రవారం వారు సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ కళాశాలలో ప్రతి యేటా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధిస్తున్నామన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ వారికి ఉన్నత పదవులు



సీఎం రేవంత్‌రెడ్డితో నమిలికొండ సునీల్‌రెడ్డి

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడేవారికి కొంచెం ఆలస్యమైన భవిష్యత్‌లో మంచి పదవులు దక్కుతాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ సోషల్ మీడియా టీం సభ్యులతో సమావేశం అయ్యారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నాచారం డివిజన్‌కు చెందిన సోషల్ మీడియా టీం సభ్యుడు నమిలికొండ సునీల్‌రెడ్డితో పాటు పలువురు కలిశారు.


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్



కాంగ్రెస్‌లో చేరుతున్న కార్పొరేటర్ చీరాల నర్సింహ

బోడుప్పల్: 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, సీనియర్ నాయకులు రాపోలు రాములు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన అవిశ్వాసంలో పాల్గొని కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి తోటకూర అజయ్ యాదవ్‌ను బలపరుస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో కాంగ్రెస్ గెలుపు ఖాయం



కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డితో రైతు సేవా సహకార సంఘం సభ్యులు

అల్వాల్: అల్వాల్‌కు చెందిన రైతు సేవా సహకార సంఘం మాజీ అధ్యక్షుడు తోట దశమంతరెడ్డి శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మల్కాజిగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భోజిరెడ్డి, కిషర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు తవ్వి.. పైపులు వేసి..
నిర్లక్ష్యంగా వదిలేసి..

- గుంతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఇప్పటికే అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలంటే తిప్పలు

కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో పెండింగ్‌లో పైప్‌లైన్ పనులు ఇవే..



కీసర: నత్తనే నయం అనే విధంగా సాగుతున్నాయి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ పనులు.. నెలలు గడుస్తున్నా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో భాగంగా శామీర్‌పేట నుంచి కీసర మీదుగా పైప్‌లైన్ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి పనులు చేయడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ ద్వారా శామీర్‌పేట మండలం నుంచి యాద్గార్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధి మీదుగా వివిధ గ్రామాల్లోని వ్యవసాయ భూములకు సాగునీరు, చెరువుల్లో కాళేశ్వరం నీటిని నింపేందుకు పెద్దసైజ్ పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. కొన్ని నెలలుగా పనులు చేపడుతున్నా కొన్నిచోట్ల మందకొడిగా కొనసాగుతున్నాయి.

పెద్దసైజ్‌లో గుంత తీసి..

శామీర్‌పేట నుంచి వివిధ గ్రామాలతో పాటు మండల కేంద్రమైన కీసర మీదుగా చేపడుతున్న పైప్‌లైన్ పనుల్లో భాగంగా సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లే దారిలో పనులను పెండింగ్‌లో పెట్టారు. దీంతో కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. కీసర–శామీర్‌పేట ప్రధాన రహదారి నుంచి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లే రహదారి ప్రారంభంలోనే కాళేశ్వరం పైప్‌లైన్ కోసం పెద్దసైజ్‌లో గుంత తీసి పైప్‌లైన్ కూడా వేశారు. కానీ గుంతను మాత్రం నెలలు గడుస్తున్నా పూడ్చడం లేదు. దీంతో సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయానికి మొదటిసారి వచ్చే ప్రజలు రహదారి బంద్ అయ్యిందని తిప్పలు పడాల్సి వస్తోంది.

కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవాలి

ఈ రహదారిలో పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తి చేసిన కాంట్రాక్టర్ పైప్‌లైన్ జాయింట్ పనులు చేపట్టి గుంతను ఎందుకు పూడ్చడం లేదో అర్థం కావడం లేదు. అతికష్టం మీద పక్క నుంచి ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలాల నుంచి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది కీసరగుట్టకు వెళ్లే ప్రధాన రహదారి మీదుగా వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారి మీదుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుంటున్నారు. ఈ విషయంలో అధికారులు, పాలకులు స్పందించి కాంట్రాక్టర్ పనులు త్వరగా పూర్తి చేసేలా ఒత్తిడి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పరిస్థితి ఇలా.. రాకపోకలు ఎలా..

అర కిలోమీటర్ మేర ఉన్న రహదారిలో రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఈ రహదారిలో సీసీరోడ్డు వేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కీసరలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల గృహ సముదాయాల్లో నివాసం ఉంటున్న ప్రజలు కూడా ఈ రహదారి మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. తమ ఇళ్లకు వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేయకపోతే ఎలా రాకపోకలు సాగిస్తామని, పేద ప్రజలు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో చకచకా.. ప్రస్తుతం ముందుకు సాగక..

- పీర్జాదిగూడ – పర్వతాపూర్ రోడ్డు విస్తరణపై కాంగ్రెస్ నిర్లక్ష్యం
- నిధులు విడుదల చేయకపోవడంతో నిలిచిపోయిన పనులు
- ఆరోపించిన బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బండారి రవీందర్



మేడిపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే హెచ్‌ఎండీఏ నిధులు రూ.26 కోట్లతో చేపట్టిన పీర్జాదిగూడ నుంచి పర్వతాపూర్ నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు ఆలస్యం అవుతున్నాయని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బండారి రవీందర్ ఆరోపించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మెరుగైన రవాణా వ్యవస్థ, భవిష్యత్ అవసరాల కోసం రోడ్డు విస్తరణ చేపట్టాలని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వానికి విన్నవించారు. మున్సిపల్ మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనుల కోసం హెచ్‌ఎండీఏ ద్వారా సుమారు రూ.26.32 కోట్లను మంజూరు చేయించి శంకుస్థాపన చేశారన్నారు. గత ప్రభుత్వం హయాంలో పనులు చకచకా సాగాయని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పనులకు బ్రేక్ పడిందని అన్నారు. నిధులు మంజూరు చేయకపోవడంతోనే ఇలా జరిగిందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులకు అవగాహన లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆరోపించారు. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి



డివిజన్‌లో సీవరేజ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత

ఉప్పల్: ఎన్నికల సందర్భంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీ, గణేష్‌నగర్ కాలనీల్లో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. సీవరేజ్ పరంగా కాలనీ వాసులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. ఈ మధ్య కాలంలో నీటి లీకేజీలు, ఎక్కడ పడితే అక్కడ మురుగు పారడం వంటి సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ఐ మార్క్ వస్తువులను కొనుగోలు చేయాలి



మహిళలకు ఐఎస్ఐ ముద్రపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీవో ఆఫీసర్ అభిసాయి

మల్లాపూర్: వస్తువులు కొనుగోలు చేసే ముందు నాణ్యతను ధ్రువీకరణ కోసం ఐఎస్ఐ మార్కును తప్పనిసరిగా చూడాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఎస్పీవో ఆఫీసర్ అభిసాయి కోరారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్, నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్లో మహిళా సంఘ సభ్యులకు, కాలనీ మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. అభిసాయి మాట్లాడుతూ. వస్తువులపై ఐఎస్ఐ మార్క్ వినియోగదారులకు భరోసా అని, ఏ వస్తువు కొన్నా తప్పక దానిపై ముద్ర చూడటంతో పాటు బీఐఎస్‌కేర్ యాప్‌లో నాణ్యతను ధ్రువీకరించుకోవాలన్నారు. బంగారు ఆభరణలపై హాల్ మార్కును భారత ప్రభుత్వం తప్పనిసరి చేసిందని, ఆభరణాలు కొనుగోలు చేసేముందు హాల్మార్క్ యూనిక్ ఐడి సంఖ్యతో పాటు బీఐఎస్ లోగో, 22కే.916 ప్యూరిటీ సూచిక, ముద్రించినవి మాత్రమే కొనాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, చార్జర్లు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై రిజిస్ట్రేషన్ మార్కును తప్పనిసరిగా చూడాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలంటూ వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రేణుక రవికుమార్

బోడుప్పల్: 15వ డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌ఎస్ డివిజన్ ఇన్‌చార్జి సిగురు రేణుక రవికుమార్ శుక్రవారం కమిషనర్ రామలింగంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మసాని వెంకట్‌రెడ్డినగర్ కాలనీ ప్రధాన రహదారిలో డ్రైనేజీ పొంగి పారుతోందని, బొల్లిగూడలో డ్రైనేజీ లీకేజీ అరికట్టాలని కోరారు. అలాగే తమ డివిజన్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి, ప్రజా రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో 15వ డివిజన్ బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు ఆరోగ్య మేరీ, కాలనీ మహిళలు శ్వేత, లక్ష్మి, మహేశ్వరి, ఉమ, గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన నాచారం బీజేపీ నేతలు



మల్లాపూర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను శుక్రవారం నాచారం డివిజన్‌కు చెందిన బీజేపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలతో ఎన్నికలో ప్రజలు బీజేపీకే మొగ్గు చూపారన్నారు. తన గెలుపు కోసం అహర్నిశలు పనిచేసిన వారందరికీ కృతజ్ఞతాలు తెలిపారు. ఈటలను కలిసిన వారిలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మారెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్, హన్మంత్ బిరదర్, చంద్రమౌళి, యోగేశ్వర్‌రెడ్డి, క్రాంతి కుమార్, గోపి, నర్సింహాగౌడ్, అనితారెడ్డి, వరలక్ష్మి, జ్యోతిరెడ్డి, నిత్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగలు అరెస్టు

మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం



నిందితుడు లతీఫ్



నిందితుడు వంశీ

మల్లాపూర్: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను నాచారం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ మండలం పెద్దవూరా గ్రామానికి చెందిన బండారి లతీఫ్(19), నాగార్జునసాగర్ మండలం పైలోన్ కాలనీ పెద్దవూరాకు చెందిన కొల్లపూడి వంశీ అలియాస్ నితిన్ స్నేహితులు. జల్సాలు, ఈజీ మనీ కోసం అలవాటు పడి వీరు వాహనాలను చోరీ చేయడం ప్రారంభించారు. ఏప్రిల్‌లో 17, 18వ తేదీల్లో నాచారం రాఘవేంద్రనగర్ కాలనీలోని సాయికృప అపార్ట్‌మెంట్‌లో ఒక్కటి, ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. నాచారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించి దొంగలను పట్టుకుని విచారించారు. రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్, యమహా ఎఫ్ జెడ్ బైక్‌ను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు. గతంలో కూడా వీరిపై చౌటుప్పల్, హుజూర్‌నగర్‌లో వీరిపై కేసులు ఉన్నాయని తెలిపారు.

బడి వడిగా పనులు

ప్రభుత్వ స్కూళ్లలో పనులు పూర్తయ్యేనా..?

- 10 రకాల పనులకు రూ.12.01 కోట్లు మంజూరు
- ఈసీ అనుమతితో నెలక్రితమే పనులు ప్రారంభం
- 699 పనులకు గాను పూర్తయినవి 107 మాత్రమే..
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో పనులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వారి పర్యవేక్షణలో ప్రభుత్వ బడుల్లో అత్యవసర(ఎమర్జెన్సీ) పనులకు శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన పనుల ప్రక్రియ కొనసాగింపునకు ఎన్నికల కమిషన్(ఈసీ) నుంచి ప్రత్యేక అనుమతులను కూడా తీసుకుంది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను గుర్తించి అత్యవసర పనులన్నీ ఈ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ బడుల్లో నెల రోజుల క్రితమే సంబంధిత ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పనులను చేపట్టినా.. ఆలస్యం అవుతుండటంతో త్వరితగతిన పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

505 ప్రభుత్వ పాఠశాలలు, 286 బడుల్లోనే పనులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 505 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో ప్రాథమిక 375, ప్రాథమికోన్నత 22, ఉన్నత పాఠశాలలు 108 ఉన్నాయి. ఇందులో 286 ప్రభుత్వ బడుల్లోనే అత్యవసర పనులను నిర్వహిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి మండలంలో 8 నుంచి 10 పాఠశాలలను గుర్తించి మన ఊరు– మనబడి –మనబస్తీ కింద జిల్లాలో మొత్తంగా 176 పాఠశాలలను ఎంపిక చేసి మౌలిక వసతుల కల్పన చర్యలు చేపట్టినా ఇప్పటి వరకు 40 శాతానికి మించి పనులు పూర్తి కాలేదు. అయితే.. కొత్త ప్రభుత్వం మన ఊరు–మన బడి–మన బస్తీ పథకానికి సంబంధం లేకుండానే.. జిల్లాలో మిగిలిన అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పది రకాల అత్యవసర పనులను 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల పర్యవేక్షణలో చేపడుతోంది. ఈ పనులన్నీ పంచాయతీరాజ్, విద్యుత్తు, ఆర్‌అండ్‌బీ, ఈడబ్ల్యూఐడీసీ, టీఎస్‌ఈడబ్ల్యూ, ఓడీసీ విభాగాల ఇంజినీరింగ్ అధికారులు చేపట్టేలా చర్యలు తీసుకుంటోంది.

ప్రారంభమయ్యేలోపు పూర్తయ్యేలా..

ఈ నేపథ్యంలోనే జిల్లాలో 15 మండలాల పరిధిలోని 286 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు గుర్తించిన 699 అత్యవసర(ఎమర్జెన్సీ) పనులకు ప్రభుత్వం రూ.12,01,51,500 మంజూరు చేసింది. ఈ నిధులతో మేడ్చల్ మండలంలో 28 ప్రభుత్వ పాఠశాలల్లో గుర్తించిన అత్యవసర పనులను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు నిర్వహిస్తున్నారు. అలాగే, శామీర్‌పేట మండలంలో 16 బడుల్లో, కీసర మండలంలో 21, మల్కాజిగిరి మండలంలో 14, కాప్రా మండలం 17, ఉప్పల్ మండలంలో 30, అల్వాల్ మండలంలో 16 ప్రభుత్వ పాఠశాలల్లో, మేడిపల్లి మండలంలో 10, ఘట్‌కేసర్ మండలంలో 29, దుండిగల్ మండలంలో 11, మూడు చింతలపల్లి మండలంలో 15, కుత్బుల్లాపూర్ మండలంలో 40, బాచుపల్లి మండంలో 06, కూకట్‌పల్లి మండలంలో 23, బాలానగర్ మండలంలో 10 ప్రభుత్వ బడులలో పనులు చేపడుతున్నారు. ఈ పనులన్నీ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు పూర్తయ్యేలా మొదటి విడతగా ప్రభుత్వం రూ.6,00,75,700 నిధులను కూడా విడుదల చేసింది.

ఒక్కో పనికి నిధుల కేటాయింపు ఇలా..

పాఠశాలల్లో చేపడుతున్న అత్యవసర పనులకు సంబంధించి కేటగిరివారీగా నిధుల కేటాయింపులను ప్రభుత్వం ప్రకటించింది. విద్యుత్ అవసరాలకు రూ.25 వేలు, మూత్రశాలలు, మరుగుదొడ్లకు రూ.35 వేలు, తాగునీటి వసతి కల్పనకు రూ.లక్ష వరకు నిధులు వెచ్చించాలన్న నిబంధనలతో 10 రకాల పనులకు నిధులను ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతం లక్ష్యంగా పాఠశాలల్లో కనీస అవసరాలు తీర్చాలన్న ఆశయంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నారు.

పూర్తయిన పనులు 107 మాత్రమే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల(జీహెచ్‌ఎంసీ, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు) పరిధిలోని ఏరియా/గ్రామ మహిళా సమాఖ్యలు, సంఘ బృందం సభ్యుల్లో ఒకరు చైర్మన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, తరగతికి ముగ్గురు తల్లుల చొప్పున సభ్యులుగా నియమితులైన 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలలో అత్యవసర పనులైన విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతర మేజర్, మైనర్ మరమ్మతులు కొనసాగుతున్నాయి. 286 ప్రభుత్వ బడుల్లో మొత్తంగా 699 పనులను చేపట్టాలని గుర్తించినా, ఇప్పటి వరకు 107 పనులు మాత్రమే పూర్తయ్యాయి. అలాగే, మరో 325 పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశించిన నేపథ్యంలో విద్యాశాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ఘట్‌కేసర్: ఎదులాబాద్ కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరుగు పేరుతో క్వింటాలుకు 5 కిలోల ధాన్యం తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వమంటూనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. ధాన్యం తడిసిపోకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



ఎదులాబాద్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సీడీఎంఏ దివ్యకు సమస్యలు వివరిస్తున్న తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్

జవహర్‌నగర్: తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం సభ్యులు సీడీఎంఏ దివ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్, కార్పొరేషన్‌లలో పనిచేసే ఉద్యోగులకు సరైన పదోన్నతులు కల్పించడం లేదని, ఒకే క్యాడర్‌లో పనిచేసే ఉద్యోగులకు పదోన్నతుల్లో వ్యత్యాసం ఉందని, ఉద్యోగులకు జీపీఎస్ ఖాతాలను తెరవాలని, రోస్టర్ పాయింట్లలో పదోన్నతులు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం సీడీఎంఏ దివ్య స్పందిస్తూ మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షులు ప్రభాకర్‌యాదవ్, ఆర్‌డీఎం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటగోపాల్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఫోరం నాయకులు తదితరులు పాల్గొన్నారు.